క్లుప్తంగా

7 నుంచి పాండురంగ స్వామి ఉత్సవాలు

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల గ్రామంలో కొలువైన రుక్మిణీ పాండురంగ స్వామి ఉత్సవాలు ఈ నెల 7 నుంచి 9వ వరకు నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కరణం నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న ధ్వజారోహణము, పంచామృతాభిషేకం, శకటోత్సవం, తొట్ల సేవ, 8న సుప్రభాత సేవ, 9న స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శివాలయం నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గ్రామస్తులు

బంట్వారం: కోట్‌పల్లి మండలంలోని బార్వాద్‌లో శివాలయం నిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమి పూజ చేశారు. అందరి సహకారంతో త్వరలోనే గుడి నిర్మాణం చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, ఈశ్వరయ్యస్వామి, నరేందర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

తాండూరు రూరల్: చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మాజీ సర్పంచు గోవింద్ చెప్పారు. ఆదివారం మండల పరిధిలోని గోనూర్ గ్రామంలో ఎంపీ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలోని పెద్ద బిచ్చప్ప ఇంటి నుంచి సల్లా వాడుక వద్దకు రూ.10 లక్షలు, కావలి రామప్ప ఇంటి నుంచి మాచనూరు పానాది వరకు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రశ్రీను, గ్రామస్తులు ఉన్నారు.

ఉద్యమ నేతకు నివాళి



మహేందర్‌రెడ్డి విగ్రహం వద్ద నాయకులు

నవాబుపేట: తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పని చేసిన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి లేని లోటు తీరనిదని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. మహేందర్‌రెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామంలోని ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, నాయకులు మాణిక్‌రెడ్డి, జగన్‌రెడ్డి, శాంతకుమార్, ప్రభాకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అశోక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం



హస్నాబాద్‌లో విద్యుత్ దీపాలతో అలంకరించిన మసీదు

దుద్యాల్: మండల వ్యాప్తంగా ఆదివారం రంజాన్ ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. దుద్యాల్, హస్నాబాద్ గ్రామాల మసీద్‌లలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఉపవాసం విడిచారు. రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా గ్రామాల్లో మసీద్‌లు విద్యుత్ దీపాలతో అలంకరించారు. నమాజ్ సమయం ప్రారంభ సమయానికి ముస్లిం సోదరులతో కిటకిటలాడుతున్నాయి.

'తీన్మార్ మల్లన్న సస్పెన్షన్ అన్యాయం'

దోమ: ప్రభుత్వ లోపాలు, ప్రజా సమస్యలపై నిరంతరం ప్రశ్నిస్తున్నాడనే అక్కసుతో తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం బాధాకరమని తెలంగాణ ఉద్యమకారుడు గార్లపల్లి మల్లన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రకుల నేతలు కాంగ్రెస్ పార్టీలో బీసీలను ఎదగనివ్వకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతో చురుకుగా ఉండి అధికారంలోకి రావడానికి ప్రధాన కర్తగా వ్యవహరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయడం తీవ్ర అన్యాయమన్నారు. వెంటనే ఆయనపై కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీలంతా ఏకమై ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

తాగి నడిపితే జైలుకే

- డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల నజర్
- నిత్యం పరీక్షలు, వాహనాల తనిఖీలు



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

దౌల్తాబాద్: మద్యంప్రియుల్లపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టి కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో సరిపెట్టేవారు. కానీ ప్రస్తుతం కేసులు నమోదైతే మందుబాబులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో మద్యంప్రియులు హడలెత్తిపోతున్నారు.

మద్యం తాగి రోడ్లపైకి

మద్యం తాగి వాహనాలు నడపడం ముప్పని తెలిసినా చాలా మంది తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. విందులు, వినోదాల్లో పాల్గొంటూ మత్తు ఎక్కిన తర్వాత కూడా వాహనాలు నడుపుతున్నారు. దీంతో పోలీసులు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పట్టుబడిన మందుబాబులపై కేసులు నమోదు చేస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్‌లో మందుబాబుల బ్లడ్ ఆల్కహాల్ శాతం(బీఏసీ) అధికంగా నమోదవడం చూసి పోలీసులు ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. పోలీసుల నిబంధనల ప్రకారం ప్రతి 100 మి.లీ రక్తంలో బీఏసీ శాతం 30కి మించకూడదు. కానీ బ్రీత్‌ఎనలైజర్ టెస్ట్‌లో మందుబాబులు సెంచరీ కొడుతున్నారు.

వెంటనే కేసుల నమోదు

పోలీసుశాఖ డ్రంకెన్ డ్రవ్ చేస్తున్నప్పుడు పట్టుబడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్షలు చేసి మద్యం తాగినట్లు తేలగానే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాదిలో ఇప్పటి వరకు సుమారు 80 వరకు కేసులు నమోదైనట్లు తెలిసింది. మోతాదుకు మించి తాగి వాహనాలు నడిపి పట్టుబడుతున్న వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తున్నారు. వాహన ధ్రువపత్రాలు లేకుండా మద్యం తాగి నడిపిన సందర్భాల్లో శిక్ష ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అవగాహన తప్పనిసరి

చాలా మంది డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. నడిపే వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో పాటు వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం కూడా అందడంలేదు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

కఠిన చర్యలు



మద్యం మత్తులో వాహనాలు నడిపితే జీవితాలు ప్రమాదంలో పడడమే కాకుండా ఇతరుల ప్రాణాలకు హాని కలుగుతుంది. ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటున్నాం. యువత కేసుల్లో ఇరుక్కోవద్దు. తద్వారా భవిష్యత్తు నష్టపోయే ప్రమాదం ఉంది.

– రవిగౌడ్, ఎస్‌ఐ, దౌల్తాబాద్

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలు



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

మర్పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు మంచి లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మర్పల్లి ఎంఈఓ అంజిలయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఘణాపూర్‌లోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అశోక్ ఆధ్వర్యంలో ఎంఈఓ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు బోధించిన ముఖ్యమైన పాఠాలను చదివించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సుధాకర్, కృష్ణయ్య, రామేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ కల్పన, మాజీ ఎంపీటీసీ బిచ్చయ్య, మార్కెట్ డైరెక్టర్ సుగ్రీవ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో మానసికోల్లాసం



జిమ్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్

అనంతగిరి: నిత్యం వ్యాయామం చేయడంతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఈమేరకు ఆదివారం వికారాబాద్ బస్టాండ్ రోడ్‌లో ఓ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిమ్ నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

6న ఉచిత వైద్య శిబిరం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి ఆస్పత్రిలో ఈ నెల 6వ తేదీన ఉచిత ఆర్థరైటిస్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆస్పత్రిలో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 50కిపైగా మోకాళ్ల మార్పిడి ఆపరేషన్‌లు చేసినట్లు పేర్కొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



స్లాబ్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఆదివారం స్లాబ్ చేశారు. ఈ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అత్యాధునిక వసతులతో కూడిన కళాశాలను దాతల సహకారంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కళాశాల నిర్మాణానికి దాతలు తోడ్పాటు అందించడం హర్షణీయమన్నారు. దాతలు అందిస్తున్న సహకారాన్ని మరిచిపోలేనిదని, వారి పేరు ఎల్లప్పుడూ చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకు పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

విరాళం అందజేత

మండల పరిధిలోని మొత్కులగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెట్ట మహేందర్ ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి రూ.40వేల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, చెంది తిరుపతిరెడ్డి, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, దంగు శ్రీనివాస్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, పల్లె ఆనంద్, ఖదీర్, భాస్కర్, అశోక్, దేవగిరి నవీన్, బచ్చలి నరేశ్, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవకు కృషి చేయాలి

కాంగ్రెస్ నేత దయానంద్‌గుప్తా



ఆలయ కమిటీ సభ్యులకు కెమెరాలను అందజేస్తున్న దయానంద్‌గుప్తా

కొత్తూరు: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ నేత దయానంద్‌గుప్తా కోరారు. మండలంలోని గూడూరు గ్రామంలో గల హనుమాన్, పోచమ్మ, మైసమ్మ ఆలయాల్లో ఆదివారం ఆయన సొంత డబ్బులు సుమారు రూ.40వేలు వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత వాతావరణం కోసం పాటుపడాలన్నారు. అన్ని కులాలు, మతాలను గౌరవించాలని సూచించారు. ఆధ్యాత్మికత అలవర్చుకునేవారు సాటివారి పట్ల ప్రేమానురాగాలతో వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లు పెంచండి

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: రాష్ట్రంలో ఎస్సీల రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీల కులగణన ప్రకారం ఎస్సీల జనాభా 18 శాతం ఉందని గుర్తించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో, చేవెళ్లలో జరిగిన ఎస్సీ డిక్లరేషన్ సభలో ఎస్సీల రిజర్వేషన్ పెంచిన తర్వాతే వర్గీకరణ చేస్తామని చెప్పారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతే వర్గీకరణ పూర్తిస్థాయిలో చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు అంటరానితనం ఆధారంగా వచ్చాయని, జనాభా దామాషా, ఆర్థిక, పేదరికంతో రాలేదని దళిత సమాజం గుర్తించాలన్నారు. సామాజిక ఉద్యమాలలో ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసిన మాలలను ఉద్దేశపూర్వకంగా కించపరచటం సరైనదికాదన్నారు. దీనిని మాలమహానాడు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇప్పటికైనా మాలలు, మాల మేధావులు, రాజకీయ నాయకులు, సామాజిక ఉద్యమకారులు అంతా ఏకమై అస్థిత్వ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. లేదంటే మాలల ఉనికి ప్రమాదంలో పడుతుందన్నారు.

ఆకట్టుకున్న వీధి నాటకం

బొంరాస్‌పేట: పల్లె సంస్కృతికి వీధినాటకాలు దర్పణం పడుతాయని పలువురు నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఏర్పుమళ్లలో శ్రీ రేణుక ఎల్లమ్మ వీధినాటక ప్రదర్శన ప్రారంభమైంది. ఈనెల 2 నుంచి 8వరకు రోజు విడిచి మరోరోజు ఈ వీధి నాటక ప్రదర్శన ఉంటుందని నాటకోపాధ్యాయుడు గంజిపల్లి పెద్ద రామయ్య తెలిపారు. గ్రామంలోని ప్రధాన వీధిలో ఆదివారం రాత్రి మొదటి రోజు ప్రదర్శన ప్రారంభించారు. 32 పాత్రలు, 30మంది పాత్రదారులు గ్రామ పెద్దల సహకారంతో వీధినాటకం ప్రదర్శించారు. హార్మోనియం మిట్టకోడూర్ హన్మయ్య పంతులు, బాబయ్య, సొండ్ చౌదర్‌పల్లికి చెందిన మధుకృష్ణ డ్రామా కంపెనీ అందిస్తున్నారు.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి



పోటిగడ్డ తండాలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: ప్రతి గ్రామ పంచాయతీని అభివృద్ధిపథంలో తీసుకువెళ్లేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని పటేల్ చెరువు తండా గ్రామపంచాయతీ పోటిగడ్డ తండాలో ఉపాధిహామీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధిహామీ నిధులలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాలు అభివృద్ధిని సాధించినప్పుడే దేశం బాగు పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, రాము, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధిహామీ నిధులతో రోడ్డు పనులు



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వం అండతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద గ్రామాలకు నిధులు మంజూరు అవుతున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే మార్గంలో హామీ పథకం కింద మంజూరైన రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. దీనికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చొరవ చూపారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బన్నే మల్లేశ్‌యాదవ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుభాష్, శ్రీశైలం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అరుణ వర్ణం... నయనానందం



తెల్ల తెల్లరగానే పల్లె తుల్లి పడుతుందీ... గున్న మావిళ్లతోటీ తోరణాలను కడుతుందీ.. అని ఓ సినిమాలో గేయ రచయిత అద్భుతంగా గ్రామీణ అందాలను వర్ణించాడు. ఇలాంటి ప్రకృతి రమణీయతను ఆస్వాదించాలంటే పల్లె వాతావరణంలోనే సాధ్యం. సరిగ్గా అలాంటి దృశ్యాలను మండల పరిధిలోని రేగడిమైలారం పటేల్ చెరువు వద్ద 'సాక్షి' కెమెరా బంధించింది. ఆదివారం ఉషోదయంలో చెరువు అందాలు చూపరులను కట్టి పడేశాయి. – బొంరాస్‌పేట

వివాహ వేడుకకు హాజరైన స్పీకర్

మర్పల్లి: మండల పరిధిలోని శాపూర్‌తండాకు చెందిన దశరథ్ కూతురు వివాహ వేడుకకు ఆదివారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



ఆయుర్వేద చికిత్సాలయం ప్రారంభం

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధన్వంతరి ఆయుర్వేద చికిత్సాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్త్రీ, పురుషులకు ఆయుర్వేదం ద్వారా దీర్ఘకాలికంగా ఇబ్బందులు పెడుతున్న రోగాలన్నింటికీ చికిత్స అందిస్తామని స్పష్టం చేశారు. ఈ చికిత్సాలయం ప్రతి నెల మొదటి, మూడో ఆదివారాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోస్ట్ గార్డ్ రిటైర్డ్ డీఐజీ అమరేందర్‌రెడ్డి, శంకర్‌పల్లివాసులు వాసుదేవ్‌కన్నా, దయాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శ్రీను, సురేశ్, కృష్ణయ్య, శోభ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు!



అధ్వానంగా ముర్తుజాగూడ–మొయినాబాద్ రోడ్డు

- శిలాఫలకాలకే పరిమితమైన ముర్తుజాగూడ–మొయినాబాద్ రోడ్డు
- మంజూరైన నిధులు ఇతర పనులకు మళ్లింపు
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గుంతలతో దర్శనమిస్తున్న రోడ్లపై ప్రయాణిస్తూ నరకయాతన పడుతున్నారు. రాత్రి వేళల్లో చాలా మంది ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మల్లా శిలాఫలకాలు..

మండల పరిధిలోని ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే ఈ రోడ్డు దాదాపు రెండున్నర కిలోమీటర్లు. ఈ రోడ్డుకు రెండుసార్లు నిధులు మంజూరుచేసి శిలాఫలకాలు వేశారు. ప్రస్తుతం అవి దిష్టిబొమ్మల్లా నిలిచాయి. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ ఈ రోడ్డుకు బీటీ వేయాలని నిధులు మంజూరు చేసి, పనులకు శంకుస్థాపన చేశారు. కానీ అప్పట్లో కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో ఆ నిధులు వేరు పనులకు మళ్లించారు. రోడ్డు అధ్వానంగా ఉందని, రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మొరపెట్టుకోవడంతో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ ఛాలెంజర్ స్కూల్ వరకు రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సీఆర్‌ఆర్ నిధులు అంచనా రూ.1.45 కోట్లు మంజూరు చేయించి 2023 సెప్టెంబర్ 7వ తేదీన శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు పనులు ముందుకుసాగలేదు.



2023లో రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

వాహనదారులకు తిప్పలు

ముర్తుజాగూడ నుంచి మొయినాబాద్ మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుపై ప్రయాణించే వాహనాదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ గుంత ఉందో, ఎక్కడ మూలమలుపు ఉందో తెలియక ప్రమాదాల బారినపడి అనేక మంది ఆస్పత్రుల పాలైన సంఘటనలు నెలకొన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. బాకారం, కాశీంబౌలి, అమ్డాపూర్, నదీమ్‌నగర్, ముర్తుజాగూడ గ్రామాలతో పాటు శంషాబాద్ మండలం నుంచి వచ్చే ప్రయాణికులు ఈ రోడ్డుపైనే మొయినాబాద్‌కు వెళ్తారు. ఇది లింకురోడ్డు కావడంతో చాలా మంది ఈ దారి గుండానే ప్రయాణిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.


రోడ్డును అభివృద్ధి చేయాలి



ముర్తుజాగూడ–మొయినాబాద్ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారింది. మండల కేంద్రానికి వెళ్లడానికి అతితక్కువ దూరం కావడంతో ప్రయాణికులు ఈ రోడ్డును ఆశ్రయిస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి రెండు సార్లు నిధులు మంజూరైన పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– పాలమాకుల లక్ష్మణ్‌యాదవ్, ముర్తుజాగూడ గ్రామస్తుడు

కాంట్రాక్టర్ ముందుకు రాలేదు



ముర్తుజాగూడ–మొయినాబాద్ రోడ్డు నిర్మాణానికి 2023 సంవత్సరంలో అప్పటి ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. అప్పట్లో టెండర్లు వేయగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులు నిలిచిపోయాయి. ఆ నిధులు ప్రస్తుతం లేవు. మళ్లీ కొత్త నిధులు వస్తేనే రోడ్డు పనులు జరుగుతాయి. – విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డిప్యూటీ డీఈ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622